## క్లుప్తంగా

### ముగిసిన శ్రీరామనామ సంకీర్తన



**అచ్చంపేట:** స్థానిక శ్రీ సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామనామ సంకీర్తన పారాయణోత్సవం వైభవంగా జరిగింది. 24 గంటల పాటు ఆగకుండా చేసిన పారాయణ ఉత్సవం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు గ్రామంలోని వీధుల్లో హరి నామ కీర్తనలతో తిరిగారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, సాముహిక వ్రతాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### కోడిపందేల స్థావరంపై దాడి

**నకరికల్లు:** కోడిపందేల స్థావరంపై దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పి.సురేష్ గురువారం తెలిపారు. మండలంలోని చీమలమర్రి–చాగల్లు గ్రామాల మధ్య డొంక సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ2,560, రెండి పందేం పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**సత్తెనపల్లి:** చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వీర్ల ధర్మరాజు (50) ఇంటి నుంచి బయటకు నడుచుకుంటూ వెళుతుండగా అనారోగ్య కారణంగా బుధవారం పడి పోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ధర్మరాజు మృతి చెందాడు. మృతుని భార్య వీర్ల సత్యవాణి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు.శోభన్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



**క్రోసూరు:** క్రోసూరు షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. బాబాకు ఇష్టమైన రోజు కావడంతో ఆలయంలో కాగడ హారతి, ప్రత్యేక పూజలు, పేదలకు అన్నదానం చేశారు. ప్రతి వారం అన్నదానం చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు తెలిపారు.

### రైతులకు 'సర్వే' ఉద్దేశం వివరించండి



**క్రోసూరు:** క్రోసూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసరావు వీఆర్వోల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న భూ సర్వే ఆన్‌లైన్ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. రైతులు సహకరించే విధంగా సర్వే ఉద్దేశాన్ని వివరంగా తెలియజేయాలన్నారు.

### ముఖ్యమంత్రి దృష్టికి పత్తి రైతుల గోడు

**అచ్చంపేట:** కావేరీ సీడ్స్ సిక్సర్ రకం హైబ్రీడ్ పత్తి విత్తనాలు సాగుచేసి, రైతులు నష్టపోయిన విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లినట్లు రైతు ప్రతినిధి తుమ్మా లూర్దుమర్రెడ్డి గురువారం తెలిపారు. గత నెల 31న సీఎం వినుకొండ పర్యటనలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో ఈ మేరకు వినతి పత్రం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. సదరు కంపెనీ పత్తి విత్తనాల కారణంగా.. ఎకరాకు రూ.50వేలకు పైగా నష్టపోయామని చెప్పారు. దీనిపై అనేకమార్లు జిల్లా అధికారులకు విన్నవించగా.. వారు శాస్త్రవేత్తలను పంపి పంట నష్టం అంచనా వేశారన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఎమ్మెల్యే శంకరరావుతో కలసి పంట నష్టాన్ని పరిశీలించాలని కోరారు. కంపెనీ ప్రతినిధులు, డీలర్లు కుమ్మక్కై పరిహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై.. సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# క్రియాశీల కార్యకర్తలే పార్టీకి బలం

- గృహ సారథులు .. జగనన్న సైనికులు
- నమ్మకంగా పనిచేయండి.. న్యాయం జరుగుతుంది
- గత పాలకులతో బేరీజు వేసుకుని ప్రజలకు వాస్తవాలు తెలియజేయండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రాజుపాలెం మండల గృహ సారథులు, కన్వీనర్లతో సమావేశం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, వేదికపై ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

**సత్తెనపల్లి:** గృహ సారథులు జగనన్న సైనికులని, ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు పార్టీ పరిపుష్టికి కార్యోన్ముఖులు కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం రాజుపాలెం మండలం గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్ల సమీక్ష సమావేశంలోఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ జగనన్న రథచక్రాలు వస్తున్నాయని, నమ్మకంగా పనిచేసిన వారికి న్యాయం జరుగుతుందని, సమష్టిగా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించారన్నారు. కన్వీనర్లు వలంటీర్లపై పెత్తనం చేయకుండా గృహ సారథులతో కలిసి పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. నియోజకవర్గంలోనూ మీరు గర్వంగా చెప్పుకునేలా పరిపాలన అందిస్తున్నామన్నారు. గత పాలకుల్లాగా దౌర్జన్యపూరితంగా వ్యవహరించడం లేదని ఇలాంటి వాస్తవాలు తెలుసుకొని ప్రజలకు తెలియచెప్పాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల వద్దకు వెళ్లి వారి సంతోషాలను, సందేహాలను పంచుకోవాలన్నారు. ఎవరైనా అసంతృప్తిగా ఉంటే ఆ అసంతృప్తికి గల కారణాలు ఏమిటో తెలుసుకొని వాటిని నివృత్తి చేయాల న్నారు. ప్రజలతో సామాజిక సంబంధాలు మెరుగుపడే కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ నాకు స్ఫూర్తి అని ఆయన వివరించారు. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంత పటిష్టమైన వ్యవస్థ వైఎస్సార్ సీపీకి ఉందని, మీరంతా సమష్టిగా పని చేస్తే మళ్లీ సునాయాసంగా అధికారంలోకి రావడం తథ్యమన్నారు. పాలనాపరమైన సంస్కరణతో ప్రజలకు సంతృప్తికర స్థాయిలో మేలు జరుగుతుందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సమన్వయంతో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వద్దకు తీసుకెళ్లాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిపాలన, సంక్షేమం గడప వద్దకే యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో గత పాలకులు దోపిడీ పూరిత వ్యవహారంతో ప్రజలను వేధించారని, ఇప్పుడు మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రశాంతమైన వాతావరణంలో విలువలతో కూడిన పరిపాలన అందిస్తున్నారన్నారు. సమావేశంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి పులిబండ్ల అశోక్‌లు మాట్లాడారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, నాయకులు బాసు లింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు



లంకెలకూరపాడులో వైద్య సేవలందిస్తున్న హనుమకుమార్, రమాదేవి

**లంకెలకూరపాడు(ముప్పాళ్ల):** ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలందించేందుకే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఏర్పాటు చేసిందని రాష్ట్ర బాలికల స్వాస్థ కార్యక్రమం పల్నాడు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హనుమ కుమార్ చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. దీర్ఘకాలికంగా అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించటంతో పాటుగా, అనారోగ్యానికి గురైన వారికి కూడా మెరుగైన వైద్య సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు పి.రమాదేవి, ఎన్.సూర్యప్రకాశరావు లు పాల్గొని 115మందికి వైద్యసేవలందించారు. ఏడుగురికి ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. గ్రామంలోని అంగన్‌వాడీకేంద్రం, ఎంపీపీస్కూల్ ను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించారు. మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఆరోగ్యపర్యవేక్షకులు కె.వి.నాగమల్లేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ వి.మనుతేజ, పి.ప్రవల్య, డి.శివపార్వతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ సూపరింటెండెంట్ చంద్రశేఖరరెడ్డి

**ముప్పాళ్ల:** విద్యార్థులు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితం గడపాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో సూపరింటెండెంట్ వి.చంద్రశేఖరరెడ్డి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో ప్రధానమైందని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటే ఉన్నతంగా జీవించవచ్చన్నారు. విద్యార్థుల నడవడిక పైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. మత్తుపదార్థాల సేవలనం వలన కలిగే అనర్థాలను వివరించారు. పల్నాడు జిల్లాలో సుమారు 56 కళాశాలలను గుర్తించి విద్యార్థులను చైతన్యపరచేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ టి.తులసీ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.అనితరాణి, ఉపాధ్యాయుడు సదానందబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'పది' ఫలితాల్లో జిల్లా ప్రథమస్థానంలో ఉండాలి

- పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటప్పయ్య
- నియోజకవర్గంలోని సబ్జెక్టు ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డీఈవో వెంకటప్పయ్య, పక్కన డీవైఈఓ వెంకటేశ్వరరావు

**సత్తెనపల్లి:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పల్నాడు జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉండాలని ఆ మేరకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య చెప్పారు. నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న సబ్జెక్టు ఉపాధ్యాయులతో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం తెలుగు, ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులతో, మధ్యాహ్నం నుంచి లెక్కలు, సైన్స్, సోషల్ బోధించే ఉపాధ్యాయులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని, ఆ మేరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్ఏ–1 పరీక్షా ఫలితాల్లో 50 శాతం కంటే తక్కువ ఫలితాలు వచ్చిన సబ్జెక్టు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందన్నారు. మరో 15 రోజుల్లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తానని ఆ సమయానికి మెరుగు పడకుంటే చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సూచన చేశారు. సమావేశంలో ఉపవిద్యశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్ వరప్రసాద్, సీనియర్ హెచ్‌ఎం తిరుమలేష్, నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సబ్జెక్టు ఉపాధ్యాయులు హాజరయ్యారు.

### నేడు పెదకూరపాడు వైస్ ఎంపీపీ ఎంపిక

**పెదకూరపాడు:** మండల రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగనుందని ఎంపీడీవో నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎంపీపీగా ఉన్న ఈదా సాంబిరెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో వైఎస్ ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో పెదకూరపాడు రెండవ సెగ్మెంట్‌కు చెందిన ఎంపీటీసీ షేక్ చాంద్‌బాషా వైస్‌ఎంపీపీగా బాధ్యతలు తీసుకున్నారు. రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక ఉదయం 10 గంటలకు జరుగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### మాచవరంలో రీసర్వేని పరిశీలించిన జేసీ



**రొంపిచర్ల:** మండలంలోని మాచవరం గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం సమీక్షించారు. సర్వే నిర్వహిస్తున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆర్‌బీకే ద్వారా రైతులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. రేట్లను అడిగి తెలుసుకున్నారు.

## జాతీయస్థాయి పోటీలకు మాదల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**మాదల(ముప్పాళ్ళ):** మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కె.ఎమ్.డి.రియాజ్ గురువారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెంలో జరిగిన అండర్–14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొని ద్వితీయస్థానం సాధించిందన్నారు. మాదల జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎనిమిదో తరగతికి చెందిన ఎస్.శ్రావ్య జాతీయజట్టులో స్థానం సంపాదించిదన్నారు. అలాగే వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంటలో జరిగిన అండర్–17 విభాగం బాలుర, బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన గొర్రెపాటి ప్రదీప్, గుడిగుంట్ల దివ్యలు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ముగ్గురు విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం పి.రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

### షూటింగ్ బాల్‌లో గోల్డ్‌మెడల్

**నరసరావుపేట ఈస్ట్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 41వ సీనియర్ ఉమెన్ షూటింగ్ బాల్ అంతర్ జిల్లాల ఆటల పోటీలలో విట్ ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థిని షేక్.ఛాందిని బంగారు పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ శివాజీ గురువారం తెలిపారు. షూటింగ్ బాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు విజయంలో కీలకపాత్ర వహించిన ఛాందినీని కళాశాల డైరెక్టర్లు చిలకల రాజారెడ్డి, కె.సాంబశివరావు, దోగిపర్తి శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

### మినుములో కొత్తరకం వంగడాల సాగు

**ఈపూరు:** చిరు సంచులను ప్రయోగాత్మకంగా సాగు చేయుట ద్వారా కొత్త రకాలను అందుబాటులోకి తీసుకొని రావడం జరుగుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గోలి అంకారావు, గోలి రత్తయ్య పొలాల్లో సాగు చిరు సంచులు (మినీ కిట్స్) మినుము పంటలో కొత్త రకాలైన ఎల్‌బీజీ 932, ఎల్‌బీజీ 752 సాగును శాస్త్రవేత్తలు ఎం.నగేష్, సీహెచ్. శ్రీలతవాణి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ జి.కిషోర్‌లు పరిశీలించారు.

### ఎరువుల దుకాణాలలో తనిఖీలు

**నరసరావుపేట రూరల్:** పట్టణంలోని ఎరువుల దుకాణాలు, గిడ్డంగుల్లో వ్యవసాయ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి.సురేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో ఎరువుల లైసెన్స్‌లో నమోదు కాని ఫారం–ఓలకు సంభందించిన రూ. 2,78,000ల విలువైన అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏవో సురేంద్రబాబు మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు, ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు.

## ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక



ప్రజావేదికలో రికవరీకి ఆదేశాలు ఇస్తున్న పీడీ జోసఫ్‌కుమార్, అధికారులు

**సత్తెనపల్లి:** మండలంలో రెండు సంవత్సరాల కాలంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను డీఆర్పీలు గత పది రోజులుగా నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పలు అంశాలను ప్రస్తావించారు. గురువారం సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ పై వచ్చిన అభ్యంతరాలపై బహిరంగ ప్రజా వేదిక సమావేశాన్ని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పీడీ, ప్రిసైడింగ్ అధికారి జోసఫ్ కుమార్ నిర్వహించారు. సత్తెనపల్లి మండలంలోని 24 పంచాయితీలో 2020 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన 1,824 పనులకు ఖర్చు చేసిన రూ.23,43,90,857 లకు సంబంధించి తనిఖీలు చేపట్టారు. గత నెల 21వ తేదీ నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు 8 టీమ్‌లుగా ఏర్పడి ఉపాధి పనుల తనిఖీలు నిర్వహించారు. ఇందులో రూ.39,018 రికవరీకి పీడీ ఆదేశించగా.. రూ.5 వేలు అపరాధ రుసుం విధించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో హార్టికల్చర్ మొక్కలు తెగుళ్ల కారణంగా రైతు పీకేయడంతో దానిపై రికవరీకి ఆదేశించారు. ప్రజా వేదికలో జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ కె.రఘుకుమార్, అంబుడ్స్‌మెన్ బాబురావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జయబూన్‌బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, ఎస్ఆర్పీ పున్నప నాయుడు, ఏపీఓ పి.వెంకటనారాయణ, సెక్రటరీలు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు 26 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయకృష్ణ

**నరసరావుపేట రూరల్:** ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 26 మంది ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జయకృష్ణ తెలిపారు. చెన్నైకి చెందిన తింక్సింక్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు కళాశాలకు చెందిన 107 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించి 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.9 లక్షల వార్షిక వేతనం అందిస్తారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అట్లూరి శాంతి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

### ఫ్యాక్షన్ సంస్కృతి టీడీపీదే

**రొంపిచర్ల:** తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై జరిగిన కాల్పులకు తనకు ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ, ప్రస్తుత ఎంపీపీ భర్త గడ్డం వెంకట్రావు పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న తెలుగుదేశం పార్టీలో ఉన్న వర్గపోరు, కుటుంబ వ్యవహారాలకు సంబందించి ఈ దాడి జరిగిందన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ అరవిందబాబు, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టించడం, ఫ్యాక్షన్ రాజకీయాలు చేయడం టీడీపీ పార్టీకే చెల్లుతుందన్నారు.

### బడ్జెట్‌లో కార్మికులకు మొండిచేయి

**నరసరావుపేట ఈస్ట్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులకు, రైతాంగానికి మొండిచేయి చూపిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు గురువారం విమర్శించారు. పేద బడుగు, బలహీన వర్గాలకు బడ్జెట్ ద్వారా ఒరిగేదేమి లేదని తెలిపారు.

### డ్రైవర్లు ఫిట్‌గా ఉండాలి

**నరసరావుపేట:** డ్రైవర్లు మద్యం, ధూమపానంకు దూరంగా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఫిట్‌గా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.పరంధామరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆర్టీవో, డీఎస్పీ ముఖ్య అతి థులుగా విచ్చేశారు. ఈ సభకు ఆర్టీసీ పీడీటీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. డీఎస్పీ సి.విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాలు నివారించాలని కోరారు. టుటౌన్ సీఐ అశోక్‌కుమార్, డెప్యూటీ సీఎంఇ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానం, ప్రశంసా పత్రాలను అందజేశారు. సభను డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి ప్రారంభించగా, జిల్లాలోని ఆరు డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కోలుకుంటున్న గురుకుల విద్యార్థినులు

- అస్వస్థత నుంచి 186 మంది క్షేమంగా ఇంటికి
- చికిత్స పొందుతున్న 20 మంది విద్యార్థినుల ఆరోగ్యం నిలకడ
- విద్యార్థినులను పరామర్శించిన జిల్లా లీగల్ అథారిటీ సర్వీస్ చైర్మన్, జిల్లా జడ్జి కలపాల రత్న కుమార్



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా లీగల్ అథారిటీ సర్వీస్ చైర్మన్, జిల్లా జడ్జి రత్నకుమార్

**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురై విద్యార్థినులు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. మొత్తం 206 మంది విద్యార్థినులు అస్వస్థత గురికాగా గురువారం నాటికి 186 మంది విద్యార్థులు క్షేమంగా డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 15 మంది, గుంటూరులో ఐదుగురు విద్యార్థినులు వైద్య సేవలు పొందుతుండగా వారి ఆరోగ్యం కూడా నిలకడగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను జిల్లా లీగల్ అథారిటీ సర్వీస్ చైర్మన్, జిల్లా జడ్జి కలపాల రత్న కుమార్ పరామర్శించారు. రాష్ట్ర న్యాయశాఖ ఆదేశాలతో వైద్యశాలలో విద్యార్థినులను విచారించారు. కలుషిత ఆహారంపై విద్యార్థినుల నుంచి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన బాలికలతో మాట్లాడారు. గురుకులంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, ఏ సమయంలోనైనా తెలియ చేయవచ్చునని విద్యార్థినులకు సెల్ నెంబర్ అందజేశారు. అనంతరం విద్యార్థినుల ఆరోగ్యం పై వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాలకు అభివృద్ధి కమిటీ అందిస్తున్న సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.75 లక్షల వరకు అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ నేతృత్వంలో వైద్యశాలకు వివిధ రకాల పరికరాలు అందించారని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు వివరించారు. వైద్యశాలలో రోగులకు ఎలాంటి అవసరం వచ్చినా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు అభివృద్ధి కమిటీ సత్వరమే స్పందించి ఆ అవసరాలను తీర్చటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ పనితీరును న్యాయమూర్తి రత్నకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 22 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో ఎలాంటి అలక్ష్యం ప్రదర్శించడం లేదని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు వివరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, వైద్యులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు. డీసీఓ శాంతి విశాల ఏరియావైద్యశాలను సందర్శించి బాలికల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. గురుకులంలో డ్రైనేజీ సిస్టమ్ మరమ్మతులు, మంచినీటి ప్యూరిఫైర్ ఏర్పాటు వంటివి చేపట్టారు. పెరిగిన గడ్డి మొత్తాన్ని తొలగింపచేయించారు.

### కొండవీడు కోటలో వసతుల కల్పనే లక్ష్యం

**జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు**

**యడ్లపాడు:** పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటికి అనుగుణంగా కొండవీడు కోటలో సౌకర్యాలను అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు చెప్పారు. కొండవీడుకోటను గురువారం ఆయన సందర్శించారు. కొండపైన అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నగరవనం అభివృద్ధి పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం కొండవీడు–నగరవనం కార్యక్రమం ద్వారా కొండపైన సందర్శకుల కోసం తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు, బొగన్విల్లియా, గోల్డెన్ దారంతో మొక్కలతో పచ్చదనం పెంపొందించడం, వేమన మండపంలోని ఫ్లోరింగ్ పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా పనుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ డి.వెంకటరమణ, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.నీలిమాదేవి, ఫారెస్టు బీట్ ఆఫీసర్ షేక్ అమీర్‌జానీబాష ఉన్నారు.